


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 07-03-2024 సంపుటి : 06 సంచిక : 177 పేజీలు : 8 వెల : రూ 3-00

## నీటి అడుగున తొలి మెట్రో రైలు ప్రారంభించిన మోదీ..

### విద్యార్థులతో కలిసి ట్రయల్ రన్ జర్నీ



మార్చి6 , ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం దేశ వ్యాప్తంగా పలు మెట్రో ప్రాజెక్ట్‌లను ప్రారంభించారు. దీనిలో భాగంగా పశ్చిమబెంగాల్ రాష్ట్రం కోల్‌కతాలో నిర్మించిన దేశంలోనే మొట్టమొదటి అండర్ వాటర్ మెట్రో మార్గాన్ని బుధవారం ప్రధాన మోదీ ప్రారంభించారు.హౌరా మైదాన్ - ఎస్‌ప్లనేడ్ మెట్రో సెక్షన్ వెళ్లే మార్గంలో ఉన్న హుగ్లీ నది కింద ఈ టన్నెల్‌ను నిర్మించారు. హౌరా మెట్రో స్టేషన్ దేశంలోనే అత్యంత లోతైన మెట్రో స్టేషన్‌గా రికార్డు సొంతం చేసుకుంది. ఈ కొత్త మెట్రో రూట్‌తో కోల్‌కతాలో రవాణా వ్యవస్థ మరింత సులభతరం కానుంది. కోల్‌కతాలో జరిగిన అండర్ వాటర్ మెట్రో టన్నెల్ ప్రారంభ వేడుక అనంతరం మోదీ విద్యార్థులతో కలిసి తొలిసారి ఈ మెట్రోలో ప్రయాణించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ విద్యార్థులతో ముచ్చటించారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.ఎస్‌ప్లనేడ్ నుంచి హావ్‌డా మైదాన్ స్టేషన్ వరకు ప్రధాని ప్రయాణించారు. సుమారు రూ.120 కోట్ల వ్యయంతో 16.6 కిలోమీటర్ల మేర ఈ మార్గాన్ని నిర్మించారు. హుగ్లీ నది కింద నిర్మించిన ఈ అండర్ వాటర్ మెట్రో రైలు మార్గం కోల్‌కతాలోని రెండు జంట నగరాలైన హౌరా - సాల్ట్ లేక్‌లను కలుపుతుంది. అండర్‌వాటర్ మెట్రో రైలులో మోదీతో పాటు రాష్ట్ర అధ్యక్షుడు సుకాంత మజుందార్, ఎమ్మెల్యే సువేందు అధికారి ప్రయాణించారు. అనంతరం మెట్రో సిబ్బందితో ప్రధాని మాట్లాడారు. వారు అండర్‌వాటర్ మెట్రో రైలు విశేషాలను మోదీకి వివరించారు. దీంతో పాటు కవి సుభాష్- హేమంత ముఖోపాధ్యాయ మెట్రో స్టేషన్, తరతాలా-మజేర్‌హట్ మెట్రో సెక్షన్‌లను కూడా ప్రధాని మోదీ ఈ రోజు ప్రారంభించారు.కాగా దేశంలో తొలిసారి 1984లోనే మెట్రో సేవలు కోల్‌కతా నగరంలోనే ప్రారంభించారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా నీటి మట్టానికి 32 మీటర్ల దిగువన హుగ్లీ నది క్రింద నిర్మించిన మెట్రోలో ఈ రోజు ట్రయల్ జర్నీ విజయ వంతంగా పూర్తి చేశారు. భూగర్భంలో 10.8 కిలోమీటర్ల లోతులో దీనిని నిర్మించారు. కోల్‌కతా ఈస్ట్ - వెస్ట్ మెట్రో కారిడార్ కింద నిర్మించిన ఈ సొరంగ రైలు మార్గం పొడవు మొత్తం 16.6 కిలోమీటర్లు. ఇందులో హావ్‌డా మైదాన్ నుంచి ఎస్‌ప్లెనెడ్ స్టేషన్ల మధ్య 4.8 కిలోమీటర్ల మేర ఉన్న లైనులో భాగంగా 520 మీటర్ల పొడవైన అండర్‌వాటర్ మెట్రో టన్నెల్ నిర్మించారు. దీనిని కేవలం 45 సెకన్ల వ్యవధిలో దాటొచ్చు.

## ఇన్పుట్ సబ్సిడీ 27,138 మంది రైతులకు 26.87 కోట్ల జమ---జిల్లా కలెక్టర్ డా. కె శ్రీనివాసులు

---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 06-వర్షాభావ పరిస్థితుల వల్ల 2023 ఖరీఫ్ సీజన్ గాను దెబ్బతిన్న పంట రైతులకు ఇన్పుట్ సబ్సిడీ క్రింద 27,138 మంది రైతులకు 26.87 కోట్ల జమ చేశామని జిల్లా కలెక్టర్ డా. కె శ్రీనివాసులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. కె శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించిన 6 మండలాల్లో వర్షాభావ పరిస్థితుల వల్ల 2023 ఖరీఫ్ సీజన్ లో దెబ్బతిన్న పంట రైతులకు ఇన్పుట్ సబ్సిడీ క్రింద 27,138 మంది రైతులకు 26.87 కోట్ల జమ చేశామన్నారు. బేతంచెర్ల మండలంలో 11,999 మంది రైతులకు 11.12 కోట్లు, బనగానపల్లె మండలంలో 4888 మందికి 4.89 కోట్లు, గడివేముల మండలంలో 1030 మందికి 1.08 కోట్లు, మిడుతూరు మండలంలో 5605 మందికి 6.1 కోట్లు, పగిడ్యాల మండలంలో 3264 మంది రైతులకు 3.2 కోట్లు, పాణ్యం మండలంలో 352 మందికి 4.1 కోట్లు జమ చేయడం



# దశాబ్దాల కల సాకారం.. గర్వంగా ఉంది: సీఎం జగన్

ప్రకాశం జిల్లా: వెలిగొండ ప్రాజెక్టుతో దశాబ్ధాల కల నెరవేరిందని, టన్నెల్‌లో ప్రయాణించినప్పుడు సంతోషంగా అనిపించిందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.బుధవారం ఆయన వెలిగొండ ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా సభలో మాట్లాడుతూ, అద్భుతమైనప్రాజెక్ట్ పూర్తి చేసినందుకు ఆనందంగా ఉందన్నారు.మహానేత వైఎస్సార్ వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఆయన కొడుకుగా ఈ ప్రాజెక్ట్ నేను పూర్తి చేయడం గర్వంగా ఉంది. ఇది దేవుడు రాసిన స్క్రిప్ట్. 15.25 లక్షల మంది తాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుంది" అని సీఎం జగన్ అన్నారు. వెలిగొండ ప్రాజెక్టుతో ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల్లో మెట్ట ప్రాంతాలకు 4 లక్షల 47వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది" అని సీఎం తెలిపారు.ఎన్నో దశాబ్దాలుగా కలలుగన్న మన స్వప్నాన్ని మన కళ్ల ఎదుటే ఈరోజు పూర్తయిన పరిస్థితుల మధ్య.. ఆ టన్నెల్‌లో కాస్తంత ప్రయాణం చేస్తున్నప్పుడు నిజంగా దేవుడు ఇంతటి అదృష్టాన్ని నాకు ఇచ్చినందుకు దేవుడికి సదా రుణపడి ఉంటాను.ప్రకాశం జిల్లా, నెల్లూరు జిల్లా, కడప జిల్లాలోని ఫ్లోరైడ్ బాధిత, కరువు పీడిత మెట్ట ప్రాంత ప్రజలను, వారి దాహార్తిని తీరుస్తూ సాగు నీరు కూడా అందించే గొప్ప కార్యక్రమం ఈ ప్రాజెక్టు.ఈ పూల వెంకటసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును అప్పట్లో నాన్నగారు దివంగత నేత ప్రియతమ నాయకుడు రాజశేఖరరెడ్డి గారు శంకుస్థాపన చేసి మొదలు పెడితే ఈరోజు ఆయన కొడుకుగా రెండు టన్నెళ్లను కూడా ఒక్కో టన్నెల్ దాదాపు 18 కి.మీ. పైచిలుకు ఉన్న ఈ 2 టన్నెళ్లను ఆయన కొడుకే పూర్తి చేయడం.. ఆయన కొడుకే జాతికి అంకితం చేయడం నిజంగా ఇది దేవుడు రాసిన స్క్రిప్టే అన్నది ఇంతకన్నా నిదర్శనం ఏముంది.పాజెక్టు మొదటి సొరంగాన్ని 2021 జనవరి 13న పూర్తి చేస్తే, రెండో సొరంగం పనులు కొద్ది రోజుల కిందటనే



పూర్తి చేసి ఇవాళ జాతికి అంకితం చేస్తున్నాం. ప్రకాశం జిల్లాలోని 23 మండలాలు, నెల్లూరు జిల్లాలోని 5 మండలాలు, కడప జిల్లాలోని 2 మండలాలు కలిపి మొత్తంగా 30 మండలాల్లోని 15.25 లక్షల మందికి తాగునీరు, 4.47 లక్షల ఎకరాలకు సాగునీటి పరిష్కారం చూపిస్తూ రెండు సొరంగాలు పూర్తయ్యాయి వచ్చే ఖరీఫ్‌లో, జూలై-ఆగస్టులో వచ్చే నీళ్లతో శ్రీశైలం నుంచి నల్లమల సాగర్‌కు నీళ్లు తీసుకొచ్చి, నల్లమల సాగర్‌లో మళ్లీ నీళ్లు నిండుతున్న సన్నివేశం, ఈ జూలై-ఆగస్టులోనే జరగబోతోంది.దాదాపు

## చంద్రబాబు, పవన్ చర్చలు



విజయవాడ, మార్చి 6 తెలుగుదేశం అధినే చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సుమారు గంటన్నర పాటు ప్రస్తుత రాజకీయాలపై చర్చించారు. బీజేపీ పొత్తు, మొదటి లిస్ట్ ప్రకటించిన తర్వాత వెల్లువెత్తిన అసంతృప్తుల వ్యవహారం, ప్రకటించాల్సిన స్థానాలపై అనుసరించాల్సిన వ్యూహం గురించి మాట్లాడుకున్నారు. ఎక్కువ భాగం భారతీయ జనతా పార్టీతో పొత్తు వ్యవహారం గురించి డిస్కషన్ జరిగినట్టు వార్తలు వస్తున్నాయి. వచ్చే వారంలో నోటిఫికేషన్ రానుందని వార్తలు వస్తున్న టైంలో ఏపీలో పొత్తుల వ్యవహారం ఇంకా కొలిక్కి రాలేదు. ప్రస్తుతానికి టీడీపీ జనసేన పొత్తులో భాగంగా సీట్లు ప్రకటించి ప్రచారం మొదలు పెట్టాయి. ఈ కూటమిలోకి బీజేపీ వస్తుందని ఎప్పటి నుంచో వార్తలు వస్తున్నాయి. ఓ సారి చంద్రబాబు ఢిల్లీ వెళ్లి చర్చలు కూడా జరిపారు. ఇది జరిగి నెలలు గడుస్తున్నా ఇంత వరకు ఎలాంటి పురగతి లేదు. ఈ పొత్తు కోసమే టీడీపీ జనసేన ఎంపీ స్థానాలు ఖరారు చేయలేదు. సమయం ముంచుకొస్తున్న టైంలో ఢిల్లీ పరిణామాలపై ఇరువురు నేతలు చర్చించారు. పొత్తు వ్యవహారం ఓ వైపు కీలకంగా ఉంటే... మరో వైపు అభ్యర్థుల జాబితాపై కూడా చర్చలు జరిపినట్టు సమాచారం. టీడీపీ ఇప్పటికే 94 మంది అభ్యర్థులనుప్రకటించింది. జనసేన ఐదుగురు అభ్యర్థులను ప్రకటించింది. పొత్తులో భాగంగా టజనసేనకు 24 సీట్లు కేటాయించారు. ఇందులో ఐదుగురు అభ్యర్థులను ఖరారు చేశారు. ఇంకా 19 మంది పేర్లు వెల్లడించాల్సి ఉంది. టీడీపీ ఇంకా ఎంత మంది జాబితా విడుదల చేయాలో తేలాల్సి ఉంది. బీజేపీతో పొత్తు ఉంటే ఒకరకమైన జాబితా లేకుండా మరో జాబితా రిలీజ్ చేయాల్సి ఉంటుంది. ఈ లోపు ఇరువురు ఢిల్లీ వెళ్లబోతున్నారని కూడా టాక్ నడుస్తోంది. దీనిపై కసరత్తు చేస్తున్నారు ఇరుపార్టీల అధినేతలు. ప్రకటించాల్సిన నియోజకవర్గాల్లో ఆశావాహులు, సర్వేల్లో ముందంజలో ఉన్న వారి వివరాలు సేకరిస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే లోపు అభ్యర్థుల జాబితాను పూర్తిగా ప్రకటించేయాలన్న ఆలోచనలో టీడీపీ, జనసేన ఉంది. కసరత్తు జరుగుతోంది.

## చంద్రబాబు బీసీ వ్యతిరేకి: మంత్రి ధర్మాన



శ్రీకాకుళం: బీసీల వ్యతిరేక భావజాలం ఉన్న వ్యక్తి చంద్రబాబు అంటూ ధర్మాన ప్రసాదరావు మండిపడ్డారు. బీసీలకు రాజ్యాధికారం ఇవ్వకుండా.. జయహో బీసీ ఎలా అవుతుంది బాబూ?అంటూ ప్రశ్నించిన ధర్మాన.. బాబు మాటలతో సామాజిక న్యాయం జరగదు.. సీఎం జగన్‌లా చేతల్లో చూపిస్తేనే సాధ్యమవుతుందన్నారు. శ్రీకాకుళం టౌన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి ధర్మాన మాట్లాడుతూ.. ఏమన్నారంటే..ఈ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం చేసింది సామాజిక న్యాయం కాదు. ఆయన ఎన్నికల కోసం మాయ మాటలు చెప్పే వారే తప్ప, ఎన్నికల కోసం మభ్యపెట్టేటువంటి హామీలు ఓటర్లకు ఇస్తారే తప్ప స్వతహాగా బ్యాక్ వర్డ్ క్లాస్ వాళ్లు సామాజికంగా ఎదగాలన్న ఆలోచన అన్నది ఆయనకు లేదు. వారికి అవసరం అయిన రాజ్యాధికారం ఇవ్వాలన్న ఆలోచన ఏనాడూ ఆయన చేయలేదు. చేయరు కూడా, అటువంటి దాఖలాలు కూడా లేవు. ఆయనేమీ ఇప్పుడొచ్చినటువంటి నాయకుడేమీ కాదు కదా ఆయన ఆల్మోస్ట్ పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రిగానే ఉన్నారు. నలభై సంవత్సరాలు రాజకీయాలలో అనుభవం ఉన్నవారు. ఆయన భావజాలం మీరు చూస్తే ఏనాడూ అతడు బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం ఇవ్వడానికి ఇష్టపడలేదు. దానికి ఒక్కటే ఒక్క ఉదాహరణ చెబుతాను.ఈ దేశంలో రాజ్యసభకు ఇప్పటిదాకా ఒక్కరిని కూడా బ్యాక్ వర్డ్ క్లాసెస్‌కు చెందిన వారిని చంద్రబాబు పంపించలేదంటేనే.. ఆయన రాజకీయ అధికారం బీసీలకు ఇస్తారంటే ఎవ్వరయినా నమ్ముతారా? అని ప్రశ్నిస్తున్నాను. ఈ రాష్ట్రంలో ప్రజలెవ్వరయినా, బ్యాక్ వర్డ్ క్లాసెస్‌కు చెందిన వారెవ్వరయినా నమ్ముతారా?. ఆయన తరువాత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వచ్చారు. ఆయన రాజ్యసభకు నలుగురు బ్యాక్ వర్డ్ క్లాసెస్‌కు చెందిన వారిని పంపించారు.ఐదు సంవత్సరాలలోనే ఐదుగురు బ్యాక్ వర్డ్ క్లాసెస్‌కు చెందిన వారిని పెద్దల సభకు పంపించారు. మీరు ఇన్ని సంవత్సరాలు రాజకీయాలలో ఉన్నారు. ఏనాడయినా మీరు ఈ విధంగా రాజకీయ అధికారం ఇవ్వడానికి ఇష్టపడలేదే ? అంటే ఏంటి ?. చంద్రబాబు భావజాలంలోనే బ్యాక్ వర్డ్ క్లాసెస్‌కు చెందిన వారికి రాజకీయ అధికారం ఇవ్వాలన్న కోణం లేదు మొదట్నుంచి. వీళ్లకు అధికారం ఇచ్చి వాళ్లను బలోపేతం చేసే పనులు మీరు ఏనాడూ చేయలేదు.నేను ఎనలైజ్ చేసిన విషయాలైతే ఇవి.

## అమేథీ నుంచే లోక్‌సభ బరిలో రాహుల్ గాంధీ?



న్యూఢిల్లీ : రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఉత్తరప్రదేశ్ అమేథీ లోకసభ నియోజక వర్గం నుంచి పోటీ చేయడం దాదాపూ ఖరారైంది.తాజాగా, ఢిల్లీలో జరిగిన పార్టీ సమావేశం నుంచి తిరిగి వచ్చిన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ప్రదీప్ సింఘాల్ మాట్లాడుతూ..అమేథీ నుంచి రాహుల్ గాంధీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో దిగుతారని అన్నారు. త్వరలో రాహుల్ గాంధీ పేరును అధిష్టానం అధికారికంగా ప్రకటిస్తుందని ఆయన పేర్కొన్నారు.ప్రదీప్ సింఘాల్ చెప్పినట్లుగానే రాహుల్ ఎన్నికల బరిలోకి దిగితే అమేథీలో రాజకీయం రసవత్తరంగా మారనుంది. కేంద్ర మంత్రి, బీజేపీ ఎంపీ స్మృతి ఇరానీపై రాహుల్ గాంధీ పోటీపడనున్నారు. తన అదృష్టాన్నిపరీక్షించు కోనున్నారు.2019 సార్వత్రిక ఎన్నికల్లో రాహుల్‌పై ఇరానీ 55,120 ఓట్ల తేడాతో విజయం సాధించారు. అయితే ఆ ఎన్నికల్లో వాయనాడ్ నియోజక వర్గంలో గెలుపొంది రాహుల్ గాంధీ లోక్‌సభలోకి అడుగుపెట్టారు. 2014 ఎన్నికల్లో రాహుల్ గాంధీ చేతిలో స్మృతి ఇరానీ ఓడిపోయారు. అయితే, ఆమె ఆ తర్వాత ఐదేళ్లలో తన పాపులారిటీని పెంచుకున్నారు. 2019 ఎన్నికల్లో రాహుల్ గాంధీని ఓడించి చారిత్రాత్మక విజయంతో కాంగ్రెస్‌కు షాక్ ఇచ్చారు.

# సంపాదకీయం

గురువారం 07-03-2024

## ఇక తెలుగు నేతలు కనిపించరా....

జాతీయ రాజకీయాలు ఈ మాట అనగానే దేశం మొత్తం కళ్లకు కదుతుంది. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఉన్న ఆసేతు హిమాచలం గురించి నాయకులు చర్చించే అవకాశం జాతీయ రాజీకీయాల్లో సస్పష్టం. ఒకప్పుడు అనేక మంది తెలుగు వారు జాతీయ రాజకీయాలను ప్రభావితం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సహా.. మద్రాసు రాష్ట్రం నుంచి కూడా అనేక మంది నాయకులు జాతీయస్థాయిలో ఓ వెలుగు వెలిగారు. అయితే.. గడిచిన పదేళ్ల కాలంలో జాతీయ రాజకీయాల్లో వన్నెలీనుతున్న తెలుగు వారి సంఖ్య తగ్గుతూ వస్తోంది. ముఖ్యంగా ఈ ఐదేళ్ల కాలంలో వేళ్ల మీద లెక్కించుకునే స్థాయిలో నాయకుల సంఖ్య పడిపోవడం గమనార్హం. ఇదే విషయాన్ని తాజాగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిప్రస్తావించారు. జాతీయ రాజకీయాల్లో తెలుగు నేతల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పట్టడం ప్రమాదకర సంకేతాలకు నిదర్శనమని ఆయన పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి గడిచిన పదేళ్ల కిందటి వరకు కూడా తెలుగు ప్రాంతానికి చెందిన అనేక మంది నాయకులు జాతీయస్థాయిలో కీలక పాత్ర పోషించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పీవీ నరసింహారావుప్రధానమంత్రిగా ఈ దేశాన్ని పాలించారు. ఆయన తర్వాత.. మళ్లీ ఈ స్థాయిలో ప్రధాని పీఠాన్ని ఎక్కగలిగిన నాయకుడు కనుచూపు మేరలో కనిపించకపోవడం గమనార్హం. ఇక, కేంద్ర మంత్రులుగా పదుల సంఖ్యలో నాయకులు పని చేశారు. అయితే.. ఇప్పటిలా కాకుండా అప్పట్లో ప్రత్యేక ప్రాధాన్యత ఉన్న నాయకులుగా జాతీయ పార్టీలు వారిని గౌరవించాయి. ఈ క్రమంలోనే మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సంజీవరెడ్డి, జైపాల్‌రెడ్డి, పళ్లం రాజు, జేడీ శీలం వంటి నాయకులు గడిచిన 15 ఏళ్ల కాలంలో దేశానికి తెలుగువారిగా సేవలు అందించారు. వీరికి ఏరికోరిపదువులు దక్కడం గమనార్హం. నిజానికి ఎన్టీఆర్ హయాంలో నేషనల్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేసి జాతీయ స్థాయిలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే పరిస్థితి తెలుగు వారికి దక్కింది. ఆ తర్వాత.. చంద్రబాబు నాయుడు హయాంలోనూ ఎన్డీయే కూటమికి సారథ్యం వహించే బాధ్యతలు కూడా వచ్చాయి. ఇక, రాష్ట్రపతి ఎంపిక నుంచి కొన్నికొన్ని మౌలిక నిర్ణయాల్లోనూ తెలుగు వారి పాత్ర ఒకప్పుడు ఉండేది. తెలుగు వారికి పదవులు దక్కేందుకు ఏ పార్టీ కూడా.. ప్రాధాన్యం తప్పనిసరిగా ఇచ్చిందే కానీ.. ఏదో సంఖ్యా పరమైన మద్దతు కోసం ఇవ్వాలని ఇవ్వలేదు. అంటే.. వారిలో ఉన్న సత్తా, ప్రజాభిమానం, జాతీయస్థాయి నాయకత్వ లక్షణాలు వంటివి ద్విగుణీకృతమయ్యాయి. ఇక, 2014 ఎన్నికల తర్వాత.. బీజేపీతో పొత్తులో ఉన్న కారణంగా రెండు కేంద్ర మంత్రి పదవులు తెలుగు వారికి అందునా తెలుగు దేశం పార్టీ నాయకులకు దక్కాయి. అయితే, వీరి ప్రధాన భూమిక జాతీయ స్థాయిలో ఇనుమడించలేక పోవడం గమనార్హం. కేంద్ర మంత్రులుగా ఉన్నప్పటికీ.. రాష్ట్రస్థాయిలోనే వారు తమను తాము పరిమితం చేసుకున్నారు. కానీ, ఒక పీవీలాగా, సంజీవ రెడ్డి మాదిరిగా, వెంకయ్య నాయుడు తరహాలో బలమైన ముద్రను సంతరించుకోలేక పోయారు. ఇక, ఇప్పుడు కనీసం జాతీయ స్థాయిలో రాణించదగ్గ నాయకులు కనిపించడమే లేదు. ఒకరిద్దరు ఉన్నప్పటికీ.. వారు కూడా.. నామమాత్రపు పాత్రలతో పరిమిత రాజకీయాలకే కట్టుబడి పోయారు. ఉదాహరణకు తెలంగాణకు చెందిన గంగాపురం కిషన్‌రెడ్డి ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోడీ హయాంలో కేంద్రమంత్రిగా ఉన్నారు. కానీ, ఆయన పరిధి చాలా స్వల్పంగా మారిపోయింది. సలహాలు ఇచ్చేందుకు, సూచనలు చేసేందుకు, విధాన పరమైన నిర్ణయాల్లో జోక్యం చేసుకునేందుకు అవకాశమే లేకుండా పోవడం ఆలోచించాల్సిన విషయం. కేంద్రంలో 2014 నుంచి ఇప్పటి వరకు అధికారంలో ఉన్న బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం తెలుగు వారి ప్రాధాన్యాన్ని నానాటికీ తీసికట్టుగా మార్చేసింది. 2019 వరకు కేంద్ర మంత్రిగా ఉన్న వెంకయ్య నాయుడును ఉపరాష్ట్రపతిని చేసిన దరిమిలా తెలుగు వారి గళం జాతీయ స్థాయిలో వినిపించడం తగ్గిపోయింది. ఇక, ఆ తర్వాత.. మరింతగా తెలుగు వారి ప్రాభవం తగ్గిపోయిందనే చెప్పాలి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి 22 మంది ఎంపీలు ఉన్నా.. వారిలోనూ ఏ ఒక్కరూ బలమైన జాతీయ స్థాయి నాయకుడిగా ఎదగలేకపోవడం గమనార్హం. దీనికి ప్రధాన కారణం ఉత్తరాది రాజకీయాల డామినేషనేనని అంటారు పరిశీలకులు. జాతీయ స్థాయిలో బలమైన నాయకులు లేకపోతే ఏం జరుగుతుంది? అనేది కీలక ప్రశ్న. తెలుగు వారి గళం బలంగా వినిపించే అవకాశం లేకపోవడం ప్రధాన లోపంగా మారుతుంది. అంతేకాదు..తెలుగు రాష్ట్రాల సమస్యల పరిష్కారానికి కూడా దిక్కులు చూడాల్సిన పరిస్థితి, విధాన పరమైన నిర్ణయాల్లో జోక్యం చేసుకునే వెసులు బాటు లేకపోవడం వంటి కీలకమైన అంశాల విషయాల్లో తెలుగు వారిపాత్ర మరింత తగ్గిపోతుంది. నిజానికి ఎంపీలుగా ఉన్న వారికి జాతీయ స్థాయిలో బలమైన గళం వినిపించడంతోపాటు.. జాతీయ రాజకీయాలపై పట్టు పెంచుకునే అవకాశం ఉంది.

## పియం స్వానిది లోన్లు సక్రమంగా కట్టండి : మెప్మ సీఎంఎం భాస్కర్ రెడ్డి

--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 06-పియం స్వానిది క్రింద తీసుకున్న వారు బ్యాంకులకు సక్రమంగా కట్టాలని కోరారు. బుధవారం మున్సిపల్ ఆవరణంలో లోన్లు తీసుకున్న సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్న వారికి మొదటి విడత 1000/-, రెండవ విడత 20000/-, మూడవ విడత 50000/- లు బ్యాంక్ ల ద్వారా లోన్స్ ఇప్పించడం జరుగుతున్నది . ప్రతి ఒక్కరూ తీసుకున్న లోన్స్ సక్రమంగా చెల్లించాలని, ప్రతి ఒక్కరూ డిజిటల్ లావాదేవీ లు తప్పక చేయాలని తెలియజేశారు. అంతే కాక కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అయిన ఇన్సూరెన్స్ స్కీం, మాతృ వందన






యోజన, జన్ దన్ ఖాతాలు, ముద్ర లోన్స్ వంటి విషయాల పై వారికి అవగాహన కల్పించడంతో పాటు అర్హులైన వారు ఇంకా ఎవరైనా ఉంటే వెంటనే సంబంధిత బ్యాంక్ లలో నమోదు చేసుకోవాలని సూచించారు.. ఈ కార్యక్రమం లో మెప్మా సిబ్బంది మరియు గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు

## దివ్యాంగుల కృత్రిమ పరికరాల తయారీ కేంద్రంకు భూమి పూజ..





విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- మార్చి 6 అమకతాడు టోల్ గేట్ సమీపంలో సెక్రెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగుల కృత్రిమ ఉపకరణాలు పరికరాల తయారీ కేంద్ర భవన నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సెక్రెడ్ డైరెక్టర్ తిప్పన్న మాట్లాడుతూ కర్నూలు నంద్యాల జిల్లాలలో దివ్యాంగుల పరికరాల తయారీ కేంద్రం లేకపోవడం వల్ల ఎంతో మంది దివ్యాంగులు ఈ పరికరాలను పొందలేక పోతున్నారు, వారి ఇబ్బందిని గమనించి ఈ రెండు జిల్లాల దివ్యాంగులకు ఉపయోగకరంగా కృత్రిమ ఉపకరణాలు పరికరాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రగతి, మార్గదర్శి, పల్లవి మండల దివ్యాంగుల సమాఖ్యలు క్రిష్ణగిరి, వెల్దుర్తి, డోన్ మండలాలకు చెందిన సమాఖ్యలు ఈ కార్యక్రమానికి బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం కర్నూలు జిల్లాదివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు నాగరాజు, శివశంకర్ తిప్పన్న ని సన్మానించడం జరిగింది. కార్యక్రమంలో సెక్రెడ్ సిబ్బంది శివశంకర్, మారుతి ప్రసాద్, వాసుదేవుడు, వీరేశమ్మ, రాజు, కృష్ణగిరి ప్రగతి సమాఖ్య అధ్యక్ష ఉపాధ్యక్షులు రాజేంద్ర, ఈశ్వరయ్య, సభ్యులు మహేశ్వరి, వెల్దుర్తి మండలం మార్గదర్శి సమాఖ్య అధ్యక్ష, ఉపాధ్యక్షులు రామగిడ్డయ్య, బంకు శ్రీరాములు, సభ్యులు సుధాకర్, ఆదిలక్ష్మి , డోన్ పల్లవి మండల దివ్యాంగుల సమాఖ్య నాయకులు పెద్దన్న, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొనడం జరిగింది.

## గోస్పాడు మండలం లో బీజేపీ పార్టీ కార్యాలయం





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 06- నంద్యాల జిల్లా గోస్పాడు మండల యందు భారతీయ జనతా పార్టీ కార్యాలయం ను నంద్యాల అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్. అభిరుచి మధు మరియు మండల అధ్యక్షులు మధు గోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అభిరుచి మధు మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టు కొని గ్రామ గ్రామం కు బీజేపీ పార్టీ చేసిన అభిరుద్ధి కార్యక్రమం లను గడప గడప కు తీసుకెళ్లి.. బీజేపీ పార్టీ ని గెలిపించుకునే విధంగా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. వైసీపీ నాయకులు అభిరుద్ధి మేము చేసాం అని సంకలు గుద్దు కుంటున్నారే తప్ప ఎలా అభిరుద్ధి చేశారో నిధులు ఎక్కడివి అనేది బహిరంగ చెర్చ కు రావాలని. సవాల్ విసిరారు. ఈ కార్యక్రమం లో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు తాడి. రామకృష్ణ రెడ్డి.. నంద్యాల పట్టణ అధ్యక్షులు కశెట్టి చంద్ర.. మహిళా మోర్చా నాయకురాలు.. బత్తిని స్వాతి.. రూరల్ మండల అధ్యక్షులు గురుబ్రహ్మం.. మండల నాయకులు నక్క నగేష్.. బీజేపీ నాయకులు.. లక్ష్మి రెడ్డి.. ఉపేంద్ర రెడ్డి.. గాండ్ల ఈశ్వర్.. మోహన్ రెడ్డి... బాలముని.. అరుణ.. రేష్మ.. శ్రీవాని.. నాయుడు.. సంతోష్... రమణారెడ్డి... ప్రసాద్ రెడ్డి... మణి.... వెంకటేశ్వర్లు... నర్సయ్య.. తదితరులు పాల్గొన్నారు.

## దశాబ్దాల కల సాకారం.. గర్వంగా ఉంది: సీఎం జగన్

(మొదటి పేజీ తరువాయి....)


3 వేల క్యూసెక్కులతో మొదటి టన్నెల్ పూర్తి చేశాం. 8,500 క్యూసెక్కుల కెపాసిటీతో రెండో టన్నెల్ పూర్తయింది. శ్రీశైలంలో 840 అడుగులు దాటిన వెంటనే రోజుకో టీఎంసీని ఈ రెండు సొరంగాల ద్వారా నల్లమల సాగర్‌కు నీరు తీసుకురాగలిగే గొప్ప పరిస్థితి ఈరోజుతో పూర్తయిపోయింది. ఈ జూలై-ఆగస్టులో నీళ్లు నింపే సమయానికి మరో 1200 కోట్లు ఖర్చు చేసి ఎల్‌ఏ ఆర్‌అండ్‌ఆర్ పూర్తి చేస్తాంఈ ప్రాజెక్టులో అత్యంత కీలకమైన ఘట్టం.. ఈ రెండు టన్నెళ్లు పూర్తి కావడం. మిగిలినవన్నీ పెద్ద ఏవీ లేవు. రిజర్వాయర్ పూర్తయిపోయింది. నీళ్లు నింపడం కోసం 1200 కోట్లు ఇస్తే పుష్కలంగా నింపే కార్యక్రమం జరుగుతుందినీళ్లు నింపే కార్యక్రమం మళ్లీ మనం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత రెండు మూడు నెలల్లోనే ఎల్‌ఏ ఆర్ అండ్ ఆర్ పూర్తి చేసి నీళ్లు నింపుతాంఈ ప్రాజెక్టు వల్ల ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకన్నింటికీ మంచి జరుగుతుందని తెలిసినా, ఎర్రగొండపాలెం, దర్శి, గిద్దలూరు, కనిగిరి, ఉదయగిరి, ఆత్మకూరు, బద్వేలు.. ఇన్ని నియోజకవర్గాలకు మంచి జరుగుతుందని తెలిసి కూడా.. ఈ టన్నెళ్లు పూర్తి చేయడంలో చంద్రబాబు హయాంలో నత్తనడకన పనులు జరిగాయి. రెండు టన్నెళు ఉన్నాయి. ఒక్కోటీ 18.8 కి.మీ. పొడవు ఉంటే, దాదాపు 37.6 కిలోమీటర్ల టన్నెళ్ల లెంత్ అయితే, ఇందులో 2004 నుంచి 2014 వరకు దాదాపు 20 కి.మీ. రాజశేఖరరెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉరుకులు పరుగులు చేస్తూ టన్నెళ్లు పూర్తి చేసే కార్యక్రమంలో యుద్ధ ప్రాతిపదికన అడుగులు పడ్డాయి. 2014 నుంచి 2019 వరకు చూస్తే కేవలం 6.6 కి.మీ. మాత్రమే టన్నెళ్ల వర్కులు జరిగాయి. ఆ తర్వాత మీ బిడ్డ ముఖ్యమంత్రి అయిన తర్వాతనే మళ్లీ ఈరోజు దాదాపు మిగిలిపోయిన 11 కి.మీ. టన్నెళ్లు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి జాతికి అంకితం చేస్తున్నాంప్రాజెక్టు వల్ల మంచి జరగాలని మనసారా కోరుకుంటూ మీ అందరికీ కూడా దేవుడి దయతో ఇంత మంచి చేసే అవకాశం నాకు ఇచ్చినందుకు దేవునికి ఈ సందర్భంగా మనసు నిండా ప్రేమతో దేవునికి కూడా కృతజ్ఞతలు తెలుపుకొంటున్నా.

## ఓల్డ్ టౌన్ అభివృద్ధిలో ముందుంది: ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 06- నంద్యాల పట్టణంలోని ఓల్డ్ టౌన్ అభివృద్ధిలో ముందుందని అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నామని, దృఢ నిశ్చయం తో పని చేస్తున్నామని ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఓల్డ్ టౌన్ అభివృద్ధిలో భాగంగా ఒకటవ వార్డులో 20 లక్షలతో సీసీ రోడ్డు పనులను చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఓల్డ్ టౌన్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది, ప్రాధాన్యత ప్రాతిపదికన అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని తెలిపారు. పట్టణంలో ఏ ప్రాంతంలో చూసినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన పనులు శాశ్వత గుర్తులుగానిలిచాయన్నారు. జిల్లా అయిన తర్వాత నంద్యాల రూపురేఖలు మారాయని. అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేశామన్నారు. రానున్న ఎన్నికల్లో మంచి చేసిన వైఎస్సార్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని , ఎమ్మెల్యే గా తనను గెలిపించాలనికోరారు. ఈకార్యక్రమంలోమున్సిపల్‌చైర్పర్సన్ మభూన్నిసా. మున్సిపల్ అధికారులు , మున్సిపల్ వైస్ చైర్మన్ పామ్ షావలి, పట్టణ అధ్యక్షుడు పున్న శేషయ్య, కౌన్సిలర్ శాదిక్ భాష ,దేశం సుధాకర్ రెడ్డి వార్డు వైసిపి నాయకులు మాజీ కౌన్సిలర్స్ మునయ్య, కన్నమ్మ, ఎర్రన్న ,తిమ్మరాజు, మరియు తదితరులు పాల్గొన్నారు.

## కూరగాయల మార్కెట్ షాపులు బహిరంగ వేలం నిర్వహించాలి : బీజేపీ



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- మార్చి 6 పట్టణ నడిబొడ్డున అత్యాధునిక వసతుల తో నిర్మించిన కూరగాయలు మార్కెట్ సముదాయంలో షాపులు కేటాయింపు వెంటనే నిలుపుదల చేసి, పత్రిక ప్రకటన చేసి బహిరంగంగా వేలం నిర్వహించాలని, లక్కీ డిప్పు ద్వారా షాపులు కేటాయించడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావటం లేదని బీజేపీ నాయకులు జిల్లా ఎజుక్యూటివ్ మెంబర్ రాఘవేంద్ర ఆచారి అన్నారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం ఇస్తూ బహిరంగ వేలం ద్వారానే మున్సిపాలిటీకీ ఆదాయం పెరుగుతుందని కేవలం కొందరు రాజకీయ నాయకుల మాత్రమే లబ్ది చేకూరేవిదంగా లక్కీ డిప్పు లో షాపులు కేటాయించడం అవి ప్రయివేటు ఆస్తులు కాదు లక్కీ డిప్ నిర్వహించడం అంటే ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడమే అని అన్నారు వెంటనే బహిరంగ వేలం నిర్వహించాలి లేని పక్షం బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని తెలిపారు . ఈ కార్యక్రమం లో కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్తకాపు హేమసుందర్ రెడ్డి, జిల్లా ఎస్టి మోర్చా అధ్యక్షులు డబ్బాలదేవేంద్రుడు, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఆర్మీ రామయ్య, ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడసారి శివశంకర్, మాజీ జిల్లా కార్యదర్శి రామచంద్ర నాయుడు,రిటైడ్ ఆర్మీ బలరాముడు మరియు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## దుర్గామాత విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో..కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి,డాక్టర్ మాచాని సోమనాథ్

ఎమ్మిగనూరు మార్చి 07,ఎమ్మిగనూరు నియోజక వర్గం,గోనెగండ్ల మండల పరిధిలోని బి అగ్రహారం గ్రామంలో దుర్గామాత విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ముఖ్యఅథితులు గా మాజీ కేంద్ర మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి, టిడిపి నాయకులు డాక్టర్ మాచాని సోమనాద ్ద నేలటూరు పరమేశ్వర్ రెడ్డి ,వెంకటరెడ్డి, షేక్ యునుష్, తిరుమల్ రెడ్డి, అక్బర్ వలి, సుధాకర్, లక్ష్మన్న మరియు తదితరులు పాల్గొన్నారు

## ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ కాంప్లెక్స్ ను ప్రారంభించిన మంత్రి బుగ్గన

విశాఖపట్నం,దేశంలో అన్ని ప్రాధాన్య త లు ఉన్న నగరంగా విశాఖకు గుర్తింపు ఉందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్ అన్నారు.విశాఖ కలెక్టర్ కార్యాలయం వెనుక 25.30 కోట్ల వ్యయంతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ భవన కాంప్లెక్స్ను ఆయన ప్రారంభించా రు. అనంతరం భవన సముదాయాన్ని పరిశీలించి మాట్లాడారు. ఈ భవన సముదాయంలో ఆర్థిక శాఖకు సంబంధించిన అన్ని విభాగాలను తీసుకొచ్చే అవకాశం ఉందన్నారు. జిల్లా ట్రెజరీ శాఖ, పే అండ్ అకౌంటెంట్, ఆడిట్ విభాగం తదితర కార్యాలయాలను ఒకే కాంప్లె క్స్ ఏర్పాటు చేస్తామని మంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి విశాఖ అభివృద్ధికి ప్రణాళిక ప్రకటించారని.. రానున్న రోజుల్లో విశాఖ పరిపాలన కేంద్రంగా మారనుందన్నారు. గడిచిన రెండేళ్లలో విశాఖలో అనే రకాల మౌలిక సదుపా యాలు కల్పించినట్లు చెప్పారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణ ంగా నైపుణ్య శిక్షణ ఇవ్వాలన్న ప్రభుత్వ ఆలోచన యువతకి మేలు చేస్తుందన్నారు.

## మంత్రి గుమ్మనూరు బర్తరఫ్

కర్నూలు, మార్చి 6,ఏపీ మంత్రి గుమ్మనూరి జయరాం బర్తరఫ్ కు గురయ్యారు. వైసీపీ నుంచి టీడీపీ లోకి పార్టీ ఫిరాయించిన కారణంగా మంత్రి గుమ్మనూరిని ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ బర్తరఫ్ చేశారు.ఆమంత్రిని బర్తరఫ్ చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేసిన సిఫార్సు మేరకు గవర్నర్ ఆమోదం తెలిపారుకర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రస్తుత కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం వైఎస్ఆర్ సీపీకిగత కొంత కాలంగా దూరం అవుతూ వచ్చారు. త్వరలో సొంత గూడుతెలుగుదేశంపార్టీలో చేరుతానే వార్తలు నేడు నిజం అయ్యాయి. వైఎస్ఆర్ సీపీ అధిష్ఠానం అభ్యర్థుల మార్పులు చేర్పుల్లో బాగంగాఆలూరు నియోజకవర్గం పార్టీ ఇంచార్జిగా విరుపాక్షిని నియ మించింది. మంత్రిగా ఉన్న జయరాంను కర్నూలు పార్లమెంటు అభ్యర్థిగా ప్రకటించారు. అయితే తన ప్రత్యర్థికి టికెట్ ఇవ్వొద్దని చెబుతూనే వచ్చారు. అంతేగాక పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేసేందుకు గుమ్మనూరు ఆసక్తి చూపలేదు. మళ్ళీ ఆలూరు టికెట్ తనకే ఇవ్వాలని పట్టు పట్టారు. దూరంగా ఉంటూ వచ్చారు. పార్టీ అధిష్ఠానం ఆయన్ను ఒప్పించేందుకు ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం రాలేదు. గుమ్మనూరు మాత్రం ఆలూరు టికెట్ కోసం పట్టు విడలేదు.

## భ్రమరాంబ మల్లికార్జునస్వామి అమ్మవారికి కాణిపాకం దేవస్థానం తరుపున పట్టువస్త్రాలు సమర్పణ

శ్రీశైలం, నంద్యాల జిల్లా శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమైనాయి ఐదవ రోజు బ్రహ్మోత్సవాలలో భాగంగా కాణిపాకం దేవస్థానం తరుపున కాణిపాకం వరసిద్ధి వినాయక ఆలయ ఈవో వెంకటేష్ ,చైర్మన్ మోహన్ రెడ్డి దంపతులు శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న కాణిపాకం దేవస్థానం అధికారులు,ట్రస్ట్ సభ్యులకు శ్రీశైలం ఆలయ చైర్మన్ రెడ్డి వారి చక్రపాణి రెడ్డి, ఈవో పెద్దిరాజు అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు అనంతరం శ్రీస్వామి అమ్మవార్ల పట్టువస్త్రాలకు శ్రీశైల దేవస్తానం ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులిచ్చారు

# గాజువాక వైసీపీలో తర్జనభర్జనలు



విశాఖపట్టణం, మార్చి 6 గాజువాక అసెంబ్లీ స్థానంలో పోటీ చేయబోయే అభ్యర్థిపై వైసీపీలో తర్జనభర్జన కొనసాగుతోంది. సిటింగ్ ఎమ్మెల్యేగా తిప్పల నాగిరెడ్డి ఉన్నారు. సర్వేలు, స్థానికంగా ఉన్న అంశాలను పరిగణలోకి తీసుకున్న వైసీపీ అధిష్టానం వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇచ్చేందుకు నిరాకరిస్తోంది. ఈ క్రమంలోనే కార్పొరేటర్ వురుకూటి రామచంద్రరావును గాజువాక ఇన్చార్జ్గా కొద్దిరోజుల కిందట నియమించారు. ఈ నిర్ణయాన్ని సిటింగ్ ఎమ్మెల్యే నాగిరెడ్డి వ్యతిరేకించినా ప్రయోజనం లేకుండా పోయింది. ఇన్చార్జ్గా ప్రస్తుతం రామచంద్రరరావు కొనసాగుతున్నారు. కానీ, రామచంద్రరరావు అభ్యర్థిత్వంపై మంత్రి బొత్స సత్యనారాయణఅసంతృప్తితో ఉన్నట్టు చెబుతున్నారు. గాజువాక అభ్యర్థిని మార్చాలని వైసీపీ అధిష్టానానికి బొత్స సూచించారని, ఈ మేరకు నిర్ణయం వెలువడుతుందంటున్నారు. విశాఖ పార్లమెంట్ స్థానం నుంచి రానున్న ఎన్నికల్లో బొత్స ఝాన్సీ లక్ష్మి బరిలోకి దిగుతున్నారు. ఈ మేరకు ఆమె అభ్యర్థిత్వాన్ని అధిష్టానం ఖరారు చేసింది. బొత్స ఝాన్సీ లక్ష్మి భర్త బొత్స సత్యనారాయణ సీనియర్ మంత్రిగా వ్యవహరిస్తున్నారు. ఉత్తరాంధ్ర రాజకీయాల్లో అనుభవమున్న నేతగా ఆయనకు పేరుతుంది. ఆర్థిక, అంగ బలం కలిగిన నేత కావడంతో బొత్సకు అంతే ప్రాధాన్యతను సీఎం ఇస్తున్నారు. ఈ క్రమంలోనే బొత్స భార్యను విశాఖ పార్లమెంట్ స్థానానికి వైసీపీ అధిష్టానం పరిగణలోకి తీసుకుని ఖరారు చేసింది. ఎగ్జిక్యూటివ్ రాజధానిగా చెబుతున్న విశాఖకు సీఎం భవిష్యత్లో రావాలంటే ఇక్కడి స్థానాన్ని వైసీపీ తప్పక గెలవాలి. అప్పుడే ఇక్కడి ప్రజలు ఎగిక్యూటివ్ క్యాపిటల్ను స్వాగతిస్తున్నారని చెప్పేందుకు వీలుంటుంది. ఇతర అభ్యర్థులతో పోలిస్తే బొత్స ఝాన్సీ బలమైన అభ్యర్థిగా అధిష్టానం భావించడం వల్లే ఆమె పేరును ప్రకటించారు. బొత్స ఝాన్సీ విజయం అధిష్టానానికి ఎంత కీలకమో.. ఈ ప్రాంతానికి సీనియర్ నేతగా ఉన్న బొత్సకు అంతే కీలకం. అందుకే బొత్స విశాఖ పార్లమెంట్ స్థానం పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ప్రతి నియోజకవర్గంలోనూ బలమైన నేతలు ఉండడంతో ఆయన కూడా విజయంపై ధీమాను వ్యక్తం చేస్తున్నారు. కానీ, ఒక్క గాజువాక నియోజకవర్గంలో మాత్రం బలహీనమైన అభ్యర్థి ఉన్నాడని భావిస్తున్న బొత్స.. మార్చాలని అధిష్టానానికి సూచించినట్టు చెబుతున్నారు. గాజువాక నియోజజకవర్గంలో యాదవ సామాజికవర్గానికి చెందిన ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. ఇక్కడ ప్రస్తుతం ఉన్న తిప్పల నాగిరెడ్డి ఆర్థికంగా బలమైన వ్యక్తి. ఆయన వద్దనుకున్న పక్షంలో యాదవ సామాజికవర్గానికి చెందిన ప్రస్తుత విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని బరిలో దించాలని బొత్స భావిస్తున్నారు. ఈ మేరకు అధిష్టానానికి ఆయన సూచించినట్టు చెబుతున్నారు. మేయర్గా సమర్థవంతంగా పని చేయడంతోపాటు రాజకీయంగా వివాదాలకు అతీతంగా ఆమె వ్యవహరిస్తూ వస్తున్నారు. ఏళ్ల తరబడి పార్టీలోనే పని చేస్తుండడం కూడా వీరికి కలిసి వచ్చే అంశం. బొత్స ఆశీస్సులు కూడా ఉండడంతో వీరి పేరు ఖరారు అయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. ఒకటి, రెండు రోజుల్లో ఈ మేరకు ప్రకటన కూడా రావచ్చని చెబుతున్నారు.

# విశాఖ 4 నియోజకవర్గాల్లో పోటీ

విశాఖపట్టణం, మార్చి 6 విశాఖ జిల్లాలో పోటీ చేయబోయే స్థానాలు, అక్కడ పోటీ చేయనున్న అభ్యర్థులకు పవన్ సూచాయగా చెప్పినట్టు చెబుతున్నారు. అందుకు అనుగుణంగానే ఇన్చార్జ్లను ఆయా నియోజకవర్గాలకు పవన్ కల్యాణ్ నియమించాలని తొలుత భావించారు. పొత్తులో ఉండడం వల్ల ఇతర పార్టీలతో ఇబ్బందులు, అక్కడ ఆయా పార్టీలు నేతలు ఎలా స్పందిస్తారన్న సందేహాలు నెలకొన్న సమయంలో ఆ నిర్ణయాన్ని పవన్ వాయిదా వేసుకున్నారు. విశాఖ జిల్లాలో జనసేన పార్టీ నాలుగు స్థానాల్లో పోటీ చేసే అవకాశముందని చెబుతున్నారు. ఆ నియోజకవర్గాలకే ఇన్చార్జ్లను పవన్ నియమించాలని భావించి వెనక్కి తగ్గినట్టు చెబుతున్నారు. ఈ నియోజకవర్గాల్లో గాజువాక, పెందుర్తి, భీమిలి, యలమంచిలి స్థానాలను జనసేన ఆశిస్తోంది. విశాఖలో పర్యటించిన పవన్ కల్యాణ్ ఈ స్థానాలకు ఇన్చార్జ్లను నియమించాలని భావించారు. భీమిలికి వంశీ కృష్ణ శ్రీనివాస్ యాదవ్, గాజువాకకు సుందరపు సతీష్ కుమార్, యలమంచిలికి సుందరపు విజయ్ కుమార్, పెందుర్తికి పంచకర్ల రమేష్బాబును నియమించాలని భావించారు. ఈ మేరకు ప్రకటన విడుదలకు సిద్ధమైనట్టు చెబుతున్నారు. కానీ, పొత్తుపై ప్రభావం ఉంటుందన్న ఉద్దేశంతో వెనక్కి తగ్గారు. కానీ, పొత్తులో భాగంగా తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో అత్యధిక సీట్లను కోరుతున్న జనసేన.. విశాఖలో కూడా నాలుగు స్థానాలు కోరుతున్నట్టు చెబుతున్నారు. ఆ నాలుగు స్థానాలు ఇవేనని పేర్కొంటున్నారు. ఈ నాలుగు అసెంబ్లీ స్థానాలతోపాటు అనకాపల్లి పార్లమెంట్ స్థానాన్ని జనసేన కోరుతున్నట్టు చెబుతున్నారు. ఇప్పటికే నాగబాబు అనకాపల్లి పార్లమెంట్ స్థానం పరిధిలో నివాసం ఉండేందుకు ఏర్పాట్లు చేసుకుంటుండగా, నాలుగు రోజులు కిందట ఈ జిల్లాలో పర్యటించిన నాగంద్రేబాబు ఆయా నియోజకవర్గాలకు చెందిన నేతలతోనూ సమావేశమయ్యారు. తన మనసులోని మాటను సన్నిహితులు వద్ద చెప్పడంతోపాటు ఆ దిశగా క్షేత్రస్థాయిలో పని చేయాలని సూచించినట్టు చెబుతున్నారు.గతంలో ప్రజారాజ్యం పార్టీ నుంచి చిరంజీవి బావ అల్లు అరవింద్ ఇక్కడి నుంచి పోటీ చేశారు. ఈ నియోజకవర్గం పరిధిలో కాపులు అత్యధికంగా ఉండడంతోపాటు మెగా ఫ్యామిలీకి అత్యధిక సంఖ్యలో ఫ్యాన్స్ ఉన్నారు. ఈ పార్లమెంట్ స్థానంలో కూటమి కూడా బలంగా ఉన్నట్టు నాగబాబు నిర్వహించుకున్న అంతర్గత సర్వేలో తేలింది. దీంతోనే ఆయన ఇక్కడకు పోటీకి సిద్ధపడుతున్నట్టు చెబుతున్నారు. తెలుగుదేశం పార్టీ నుంచి అయ్యన్న కుమారుడితోపాటుమరో ఇద్దరు నేతలు పోటీ పడుతున్నప్పటికీ అధిష్టానం నుంచి గ్రీన్ సిగ్నల్ రాలేదు. ఇది నాగబాబుకు సానుకూలంగా మారుతుందని చెబుతున్నారు.

# భర్త ఒక పార్టీ.. భార్య మరో పార్టీ

విజయనగరం, మార్చి 6 ఏపీ రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ఎన్నికల్లో టికెట్లు దక్కని నేతలు పక్క చూపులు చూస్తున్నారు. ముఖ్యంగా వైసీపీని పెద్ద ఎత్తున నేతలు వీడుతున్నారు. తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారు. అయితే ఓ ఎమ్మెల్సీ వైసీపీలో ఉండగా.. భార్య మాత్రం టిడిపిలో చేరారు . ఇదో హాట్ టాపిక్ గా మారింది. రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. విజయనగరం జిల్లా శృంగవరపుకోట వైస్ ఎంపీపీ ఇందుకూరు సుధారాణి లోకేష్ సమక్షంలో టిడిపిలో చేరారు. ఆమె వెంట 150 మంది వైసీపీ కీలక నేతలు టిడిపిలో చేరడం విశేషం. విజయనగరం నుంచి ప్రత్యేక వాహనాల్లో విజయవాడకు వెళ్ళిన వీరంతా టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. అయితే ఓ మహిళ నేత వెంట ఈ స్థాయిలో నేతలు వెళ్లడం ఏమిటన్న ఆసక్తికర చర్చ నడిచింది. అంతే ఆసక్తికర వార్త ఒకటి బయటకు వచ్చింది.ఇందుకూరి సుధారాణి ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు భార్య. వీరిది విజయనగరం జిల్లాలోని శ్రుంగవరపుకోట నియోజకవర్గం. రఘురాజు బొత్స సత్యనారాయణ అనుచరుడు. గత ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ నుంచి వైసీపీలో చేరారు. శృంగవరపుకోట టికెట్ను ఆశించారు. కానీ అనూహ్యంగా ఆ సీటును కడుబండి శ్రీనివాసరావుకు జగన్ కేటాయించారు. అయినా సరే ఇందుకూరి రఘురాజు గట్టిగానే పని చేశారు. కడుబండి శ్రీనివాసరావు ఎమ్మెల్యేగా గెలుపొందేందుకు శక్తివంచన లేకుండా కృషి చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రఘురాజుకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. అయితే ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ కావాలని రఘురాజు కోరుతూ వచ్చారు. కానీ హై కమాండ్ పట్టించుకోలేదు. అందుకే రఘురాజు తన భార్యను టిడిపిలోకి పంపించినట్లు ప్రచారం జరుగుతోంది.గత కొంతకాలంగా ఎస్. కోట వైసీపీలో విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. దీనిపై రఘురాజు ఎప్పటికప్పుడు హై కమాండ్ కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. ఈ ఎన్నికల్లో కూడా తిరిగి కడుబండి శ్రీనివాసరావుకు టికెట్ కేటాయించినట్లు తెలుస్తోంది. దీంతో విసిగి వేశారిపోయిన రఘురాజు ముందుగా తన భార్యను టిడిపిలోకి పంపించినట్లు సమాచారం. ఇప్పటికే వైసీపీ నుంచి టిడిపిలో చేరిన హై కమాండ్ సీరియస్ గా ఉంది. అనర్హత వేటు వేయాలని నిర్ణయించుకుంది. అందుకే రఘురాజు మానసికంగా టిడిపిలో చేరేందుకు సిద్ధమయ్యారు. కానీ భౌతికంగా మాత్రం వైసీపీలోనే కొనసాగుతున్నారు. తద్వారా వైసిపి నాయకత్వాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఎస్.కోటలో వ్యక్తిగతంగా ఓటు బ్యాంకు ఉన్న నేతల్లో రఘురాజు ఒకరు. ఇప్పుడు ఆయన కుటుంబమే టీడీపీలో చేరింది. అటు రఘు రాజు సైతం అంతర్గతంగా టిడిపికి సహకరించనున్నారని ప్రచారం జరుగుతుంది. అయితే రాజకీయాల కోసం భార్య ఒక చోట.. భర్త మరోచోట ఉండడం మాత్రం ప్రాధాన్యత సంతరించుకుంది. సోషల్ మీడియాలో ఒక తరహా ప్రచారం జరుగుతోంది. అయితే భర్త సమ్మతం మేరకే ఆమె టిడిపిలో చేరినట్లు తెలుస్తోంది. దీంతో అసలు విషయం తెలుసుకుని నెటిజన్లు సైతం షాక్ కు గురవుతున్నారు

# పాలిటిక్స్ ను ఊపేస్తున్న పాట

ఒంగోలు, మార్చి 6, లోక్సభ ఎన్నికలకు వేళవుతోంది. మరో వారం రోజుల్లో షెడ్యూల్ రావడం ఖాయమని ఎన్నికల సంఘం నుంచి సంకేతాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో అన్ని పార్టీలను ఎలక్షన్ ఫీవర్ వెంటాడుతోంది. ఎన్నికల సందడితో వేసవికి ముందే వాతావరణం వేడెక్కుతోంది. ఇక సిని పరిశ్రమను కూడా ఎన్నికల వాతావరణ కోసం వాడుకోవడం మొదలు పెట్టాయి పార్టీలు. ఈ క్రమంలో ఎన్నికల ప్రసంగాలను, రాజకీయ నేతలు చేసే స్పీచ్లోని హుక్ ట్యాగ్స్ తీసుకొని రూపొందించిన ఓ పాట ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేఐస్తోంది. ఈ పాట తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ నేతలను, సినీ తారలను టార్గెట్ చేస్తూ ఓ సినీ రచయిత రాసిన పాట. ప్రస్తుతం ఫుల్ ట్రెండింగ్లో ఉంది.దక్షిణాదిలో సంచలన నటుడిగా ఉపేంద్రకు గుర్తింపు ఉంది. తాజాగా ఆయన చిత్రం యూఐ. గతంలో ఏ, ఉపేంద్రలాంటి చిత్రాలతో తెలుగులో సంచలన విజయాలు య్సాధించాడు. తాజాగా ఆయన యూఐ సీనిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఈ సినిమాలో ఉపేంద్రతోపాటు రిష్మా నన్నయ్య, సన్నీలియోన్, జిషుసేన్గుపన్తా, మురళీశర్మ ఇంద్రజిత్ లోకేష్ తదితరులు నటించారు. ఈ సినిమాకు అజనీష్ లోక్నాథ్ సంగీతం అందిస్తున్నారు.యూఐ సినిమా కోసం రాసిన పాట ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ సినిమాలో పవన్ కల్యాణ్ ప్రసంగంలో వాడిన మనల్నెవడురా ఆపేది.. నేను ఉన్నానంటూ ముద్దులు ఇచ్చే వైఎస్.జగన్ అంటూ.. కుర్చీ మడతపెట్టి అంటూ చంద్రబాబు ఇటీవల వాడిన డైలాగ్స్, పాలు అమ్మిన, పూలు అమ్మిన అనే మల్లారెడ్డి సెన్సేషనల్ డైలాగ్స్తో ఈ పాట క్రేజీగా ఉంది.ఇక ఈపాట నాయకులతో ఆగలేదు. వైరల్ కంటెంటు గురించి కూడా ఇందులో ప్రస్తావించారు. ఏవేవో అనుకుంటాం. అన్నీ అవుతాయా? అంటూ బాలయ్య చెప్పిన డైలాగ్స్ను పాట కోసం వాడుకోవడంతో మరింత క్రేజీగా మారింది. తెలుగు సినిమా పరిశ్రమలో టాప్ హుక్ డైలాగ్.. రెండు చేతులు జేబులో పెట్టుకుని ఎక్కడికో వెళ్తా అంటూ త్రివిక్రమ్ మాటలు, వర్త్ వర్మ అంటూ ఇటీవల క్రేజీగా మారిన డైలాగ్స్ పాటలో పొందుపర్చారు. అల్లు అర్జున్ జై బాలయ్య అంటూ చెప్పిన డైలాగ్స్ స్పెషల్ అట్రాక్షన్గా మారింది.రెండు రోజులుగా ఈ పాట ట్రెండింగ్లో ఉంది.

# జెట్ స్పీడ్ లో వైసీపీ...

విజయవాడ, మార్చి 6 ఏపిలో ఎన్నికల కోసం వైసీపీ మరో క్యాంపెయిన్ ప్రారంభించింది. అన్ని వర్గాలకు దగ్గరయ్యేలా భారీగా ప్రచారాన్ని ముమ్మరం చేసింది వైసీపీ. అందులో భాగంగానే సిద్ధం సభలకు దీటుగా ఏపి వ్యాప్తంగా నా కల పేరుతో జగన్ ఫోటోలతో భారీగా ప్రచారాన్ని విస్తృతం చేయబోతుంది. అధికార వైసీపీ రాష్ట్రంలో ఇప్పటివరకు సిద్ధం క్యాడర్ సమావేశాల పేరుతో ఎన్నికల హీట్ పుట్టించింది. ఉత్తరాంధ్రలో భీమిలి ఏలూరు, అనంతపురం వేదికగా జరిగిన సభలకు లక్షలాదిగా కార్యకర్తలు హాజరైయ్యారని వైసీపీ అంటోంది.అయితే సిద్ధం సభల సిరీస్లో చివరిగా జరగనున్న పల్నాడు జిల్లా సభకు 15 లక్షల మంది కార్యకర్తలు వస్తారని వైసీపీ అంచనా వేస్తోంది .ఓ వైపు సిద్ధం సభలు నిర్వహిస్తూనే ఎన్నికల పోల్ మేనేజ్మెంట్ కోసం రాష్ట్ర వ్యాప్తంగా బూత్ కమిటీలను నియమించి మరో సరి కొత్త నినాదంతో వైసీపీ ఎన్నికల రణరంగంలోకి దిగుతోంది.నాకు ఒక కల ఉంది" పేరుతో కొత్త నినాదాన్ని వైసీపీ సిద్ధం చేసింది. రాష్ట్రంలో ఇప్పటి వరకు జగన్ ఫోటోతో సిద్ధం ఫ్లెక్సీలు చూశాం, దానికి సమాధానం చెబుతు సీఎం జగన్ కార్యకర్తల కోసం సిద్ధం సభలు నిర్వహించారు .వచ్చే ఆదివారం అద్దంకిలో జరగనున్న సిద్ధం సభ చివరిది కావడంతో ఇకపై ఎపిలో సిద్ధం పోస్టర్లు కనిపించవు. అందుకు ప్రత్యామ్నాయంగా వైసీపీ మరో నినాదంలో ప్రజల్లోకి వస్తోంది. నాకు ఒక కల ఉంది పేరుతో రాష్ట్రంలోని ప్రతి నగరం ప్రతి వాడలో కార్మికులతో, పిల్లలతో, అవ్వతాతలతో, అక్కచెల్లమ్మలతో, రైతులతో జగన్ ఉన్న ఫోటోతో మీ కల నా కల అంటూ ప్రత్యక్షం అయ్యాయి. దీంతో ప్రజల కలే తన కలగా చెబుతూ అవి నేరవేర్చే దిశగా అడుగులు వేస్తానంటూ సీఎం జగన్ తన ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ మొత్తం మీ కల నా కల ప్రచారంలో మొత్తం 6 వర్గాల ప్రజలకు చెందిన హోర్డింగ్ లు ఉన్నాయి. వైసీపీ ఏర్పాటు చేసిన హోర్డింగ్లలో రైతుల కల ? జగనన్న కల, యువత కల జగనన్న కల, అక్కా చెల్లెమ్మల కల జగనన్న కల, అవ్వా తాతల కల జగనన్న, కార్మికుల కల జగనన్న కల అంటూ హోర్డింగ్లను వైసీపీ ఏర్పాటు చేసింది.వైసీపీ తాజా స్లోగన్ భారీ అర్థం ఉందన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది ఎన్నికల కోసం పార్టీలు ఇచ్చే హామీలు కేవలం మ్యానిఫెస్టోలో మాత్రమే చూస్తుంటాం కానీ అందుకు భిన్నంగా ఆలోచించిన వైసీపీ ప్రజల్లోకి ముఖ్యంగా ఆయా వర్గాల దగ్గరయ్యే నినాదాలతో ప్రజల్లోకి వెళ్తుంది. సిద్ధం పేరుతో నిర్వహించిన సభలు భారీ హిట్ అవడంతో అదే ఊపుతో ఇప్పుడు బూత్ లెవల్లో ఉండే ప్రతి ఒక్కరికీ తాము వస్తె ఏమి చేస్తాము ఏమి ఇస్తాము అనే అంశాలను ఆయా వర్గాల అభివృద్ధికి దోహద పడేలా భారీగా క్యాంపెయిన్ చేస్తుంది వైసీపీ. ముఖ్య యువత, రైతులు, వృద్ధులు, కార్మికుల కోసమే వైసీపీ అండగా ఉంటుందన్న అర్థం వచ్చేలా క్యాంపెయిన్ చేస్తుంది. ఇప్పుడు జెట్ స్పీడ్ ఎన్నికల కథన రంగంలో దూసుకెళున్న వైసీపీ కొత్త నినాదంతో సరికొత్తగా అడుగులు వేస్తుంది.

# ఆఖరి సభలోనే అస్త్రాలు

గుంటూరు, మార్చి 6 ఆఖరి సిద్ధం సభలో మేనిఫెస్టో ప్రకటించేందుకు సీఎం జగన్ రెడీ అయ్యారు. బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అద్దంకిలో ఆఖరి సిద్ధం సభను నిర్వహించాలని నిర్ణయించుకున్నాయి. ఇప్పటికే సభ రెండు సార్లు వాయిదా పడింది. చివరిగా పదో తేదీని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు రోజులకో సారి సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న విజయసాయిరెడ్డి పదిహేను లక్షల మంది వస్తారని అంచనా అని ప్రకటిస్తున్నారు. అయితే సిద్ధం సభ మరోసారి వాయిదా పడే అవకాశాలు ఉన్నాయని వైసీపీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. సీఎం జగన్ ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీతో సమావేశవ్వాలని చాలా రోజులుగా అనుకుంటున్నారు. అపాయింట్మెంట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ప్రధాని మోదీ దగ్గర భరోసా తీసుకుని కొత్త కొత్త స్కీముల్ని ఇంప్లిమెంట్ చేసి.. ఎన్నికలకు వెళ్లాలనుకుంటున్నారు. ఇందు కోసమే ఆఖరి మంత్రి వర్గ సమావేశాన్ని కూడా ప్లాన్ చేశారు. ఇప్పటికే కొత్తగా పెట్టాల్సిన కొన్ని స్కీములపై పార్టీ నేతలు, సీనియర్లతో చర్చించారు. ఈ ప్రకారం రైతు, డ్వాక్రా రుణ మాఫీ చేయాలని అనుకుంటున్నట్లుగా తెలుస్తోంది. అయితే అధికారంలో ఉన్నాం కాబట్టి హామీలు ఇస్తే బలంగా ఉండవని పాక్షికంగా అమలు చేసేందుకు జీవోలు రిలీజ్ చేసి అయినా ఎన్నికలకు వెళ్లాలని అనుకుంటున్నారు. అందు కోసం కొంత ఆర్థికపరమైన మద్దతు అవసరం.ప్రధాని మోదీని కలిసి ఇదే అంశంపై విజ్ఞప్తి చేయాలని అనుకుంటున్నట్లుగా తెలుస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఏపీకి ఇచ్చే అప్పు పరిమితిలో ఇరవై వేల కోట్ల రూపాయలు ఈ ఏడాదే ఇస్తే.. రెండు స్కీముల్ని పరిమితంగా అమలు చేసేందుకు జీవో ఇచ్చి.. కొంత మంది కి రుణమాఫీ చేయాలన్న ఆలోచనలో ఉన్నారని అంటున్నారు. కానీ ప్రధానమంత్రి నరేంద్రమోదీ చాలా బిజీగా ఉన్నారు. పదమూడో తేదీ వరకు తీరిక లేని పర్యటనలు ఉండనున్నాయి. పదమూడో తేదీ లేదా ఆ తర్వాత రోజు ఎన్నికల షెడ్యూల్ వస్తుంది. అప్పటి వరకూ మోదీ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలను చుట్టేయనున్నారు. ఈ క్రమంలో మోదీ అపాయింట్మెంట్ దొరకడం అంత సులువుగా కనిపించడం లేదు. ఇదే అంశంపై ఢిల్లీకీ ఆర్థిక శాఖ ఉన్నతాధికారుల్ని పంపినా.. పెద్దగా ప్రయోజనం కలగలేదు. ప్రధాని మోదీ చెబితే పనైపోతుందన్న అంచనాలో ఉన్నారు. అందుకే ప్రధానిని కలిసేందుకు సీఎం జగన్ చాలా తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అనుకున్నట్లుగా జరిగితే కేబినెట్లో నిర్ణయాలు తీసుకుని. జీవోలు ఇచ్చేస్తే.. ఇక ఎలక్షన్ కోడ్ వచ్చినా సమస్య ఉండదని అనుకుంటున్నారు. ఎన్నికల సమయంలో ఖాతాల్లో డబ్బులు వేయవచ్చని

## త్రాగునీటి అవసరాల కోసం తెలుగు గంగ ప్రధాన కాలువ ద్వారా నీరు విడుదల.

రుద్రవరం.మార్చి 06 :రుద్రవరం , ఆళ్లగడ్డ మండలాలలో ప్రజల త్రాగునీటి అవసరాల కోసంతెలుగుగంగ ప్రధానకాలువ నుంచిగంగఅధికారులునీటిని విడుదల చేశారు. బుధవారం వెలుగోడు రిజర్వా యర్నుంచి1800 క్యూసెక్కుల సామర్థ్యంతో నీటిని విడుదల చేయడంతో నీరు గండ్లేరు రిజర్వాయర్ కు చేరుతుంది. నిండు వేసవి కావడంతో చెరువులు కుంటల్లో ఉన్న నీరు ఎండిపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి కొన్ని గ్రామాలలో ప్రజలు త్రాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అధికారులు వెలుగోడు రిజర్వాయర్ నుంచి రుద్రవరం సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న ద్వారా ఆళ్లగడ్డ మండలంలోని కొన్ని గ్రామాలతో పాటు ఆళ్లగడ్డమున్సిపాలిటీకివిడతలువిడతలుగా అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు.

## సంకల్ బాగ్ హరి హర క్షేత్రంలో శివరాత్రికి ప్రత్యేక కార్యక్రమాలు



విభారె న్యూస్ కర్నూలు మా ప్రతినిధి మార్చి 06- సంకల్ బాగ్ హరి హర క్షేత్రంలో మహా శివరాత్రి పురస్కరించుకుని వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం ఆలయ కమిటీ వారు పేర్కొన్నారు. బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 08-03-24 శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా సంకల్ బాగ్ హరిహర క్షేత్రంలో వెలసిన శ్రీ భవాని సమేత రామలింగేశ్వర స్వామి వారికి ఉదయం 5 గంటల నుండి అభిషేకాలు నిర్వహించడం జరుగుతుందని .అలాగేరాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో రుద్రాభిషేకంనిర్వహించడం జరుగుతుందన్నారు , అభిషేకం అనంతరంశ్రీ భవాని, శ్రీ రామలింగేశ్వర స్వామి వార్ల కళ్యాణం జరుగుతుందని .మరియు09-03-24 శనివారం ఉదయం 10 గంటలకు అన్నాభిషేకం తదనంతరం అన్న ప్రసాద వితరణ,సాయంకాలం6గం"లకుశ్రీభవానిసమేత రామలింగేశ్వర స్వామి వార్ల గ్రామోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు భక్తులు ఈ కార్యక్రమం లో పాల్గొని స్వామి అమ్మవార్ల కృపకు పాత్రులు కాగలరు అని కోరారు. భక్తులకు మరిన్నీ వివరాలుకావాలంటేఈ నెంబర్లకు పోన్ చేయవచ్చని తెలిపారు. 9059000992, 9491526678, 8074290549, 9247208609, 9441892815.

## కాంగ్రెస్ పిసిసి అధికార ప్రతినిధిగా బి. చిన్న రామాంజనేయులు



విభారె న్యూస్ కర్నూలు మా ప్రతినిధి మార్చి 06- ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధిగా బి చిన్న రామాంజనేయులు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర కాంగ్రెస్ సోషల్ మీడియా చైర్మన్ మాజీ రాజ్యసభ సభ్యులు యన్ తులసి రెడ్డి చిన్న రామాంజనేయులు కర్నూలు జిల్లా కాంగ్రెస్ కు సంబంధించి అధికార ప్రతినిధిగా నియమించారు. బుధవారం రామాంజనేయులు విలేకరులతో మాట్లాడుతూ జాతీయ ప్రియతమ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ , అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే , రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు వైఎస్ షర్మిల రెడ్డి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మాణిక్యం ఠాగూర్ , రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి , రాష్ట్ర కాంగ్రెస్ సోషల్ మీడియా చైర్మన్ ఎన్ తులసి రెడ్డి కి మరియు ఈ పదవి రావడానికి కృషిచేసిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కే బాబురావు కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు , ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేయడమే మా కర్తవ్యమని, వచ్చే సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలలో చైతన్యం తెస్తామని ఆయన అన్నారు.

## మహానంది క్షేత్రంలో మోదలైన శివరాత్రి ఉత్సవాలు:ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 06. నంద్యాల జిల్లా మహానంది క్షేత్రంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి మోదలు అయ్యాయని ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బ్రహ్మోత్సవాల్లో . భాగంగా బుధవారం మోదటి రోజు ఉదయం గణపతి పూజ,పుణ్యాహవాచనం, త్రిశూల పూజ, పంచగవ్యప్రాశన,ఉత్సవసంకల్పం,ఋత్విక్వరుణ దీక్షా ధారణ,మూల మూర్తులకు కంకణధారణ,మరియు మధ్యాహ్నం వాస్తు పర్యగ్నికరణం,వాస్తుశాంతి.మృత్సం గ్రహణం, తీర్థపరిగ్రహణం,అంకురార్పణ,అగ్నిప్రతిష్ఠాపన, కలశస్థాపన, ధ్వజారోహణం,రాత్రి మయూరవాహనంపై ఉత్సవ మూర్తులు భక్తులకు దర్శనం ఇచ్చారు.



# జాతీయ రహదారి రక్తసిక్తం

**తిరుమల దర్శనానికి వెళ్లి తిరిగి వస్తూ....**
**తిరిగిరాని లోకాలకు**
**ఆగివున్న లారీని ఢీకొన్న కారు -5 గురు మృతి**



ఆళ్లగడ్డ ప్రతినిధి మార్చి 06 విభారె న్యూస్ :- కర్నూలు -కడప జాతీయ రహదారి పై బుధవారం తెల్లవారు ఝామున ఆగి ఉన్న లారీని కారు ఢీకొన్న సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న 5 గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఆళ్లగడ్డ మనీడలంలోని నల్లగట్ల వద్ద చోటు చేసుకుంది. ఆళ్లగడ్డ రూరల్ సిఐ హనుమంతు నాయక్ తెలిపినవివరాలుఇలాఉన్నాయి. హైదరాబాద్‌లోని ఆల్వాల్ లోనివెస్ట్‌వెంకటాపురానికి చెందిన మంత్రి రవీంద్ర కుమారుడు బాలకిరణ్‌కి కావ్యశ్రీలకు ఫిబ్రవరి29నతెనాలిలో పెళ్లైందన్నారు. ఈ నెల 3న షామీర్‌పేటలో గ్రాండ్‌గా రిసెప్షన్ కూడా జరిగిందన్నారు. రిసెప్షన్ వేడుకలు ముగిసిన వెంటనే రవీంద్ర ఆయన భార్య లక్ష్మి లు కొత్తదం పతులు బాలకిరణ్, కావ్యశ్రీ లతో కలిసి తమ కారులో డ్రైవర్ అశోక్‌తో కలిసి తిరుమల దైవదర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఆళ్లగడ్డ మండలం నల్లగట్ల గ్రామ సమీపంలోకి రాగానే బుధవారం ఉదయం 5:45 గంటలకు బహిర్భూమికి వెళ్లేందుకు నిలబెట్టిన లారీని కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుందన్నారు. కారులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ఐదు మంది అక్కడి కక్కడే మృతి చెందినట్లు రూరల్ సీఐ హనుమంతనాయక్ తెలిపారు. ప్రమాద సంఘటన తెలిసిన వెంటనే తాను తమ సిబ్బందితో వెళ్లి ప్రమాద సంఘటన గురించిఆరాతీశామన్నారు. 5 మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించామన్నారు. మరణించిన కుటుంబానికి చెందిన బంధువులకు ప్రమాద సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు. రూరల్ పోలీసులుకేసునమోదు దర్యాప్తు జరుపుతున్నారు.

# సార్వత్రిక ఎన్నికలకు అభ్యర్థుల జాబితా :డాక్టర్ కురువ నాగేష్




విభారె న్యూస్ కర్నూలు మా ప్రతినిధి మార్చి 06-. సార్వత్రికల ఎన్నికల్లో పోటీ చేసేందుకు నేషనల్ ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ జేఏసీ అధ్యక్షులు డాక్టర్ కురువ నాగేష్ ఆధ్వర్యంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ నాయకులు ప్రజాసంఘాలు మహిళా సంఘాలు కుల సంఘాలు తో కలిసి అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. బుధవారం కర్నూల్ లో డాక్టర్ బాబా అంబేద్కర్ భవన్లో జరిగిన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో.నేషనల్ ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ జేఏసీ అధ్యక్షులు డాక్టర్ కురువ నాగేష్ మాట్లాడుతూ కొంత మంది అభ్యర్థి పేర్లు ప్రకటించామని మిగతా జాబితా తొందరలో ప్రకటిస్తామని తెలిపారు. కర్నూల్ ఎంపీ మరియు నంద్యాల ఎంపి గా డాక్టర్ కురువ నాగేష్ పోటీల్లో ఉంటారని కర్నూల్ ఎమ్మెల్యేగా ఆర్ఎంపీ డాక్టర్ పద్మావతి. కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీరిష ఆత్మకూరు ఎమ్మెల్యే సింధు నాగేశ్వర రావు యాదవ్ . పత్తి కొండకు ఎమ్మెల్యే గా వెంకటేశ్వర్లు. అల్లూరు ఎమ్మెల్యే గా ప్రసాద్ మోహన్. నంద్యాల ఎమ్మెల్యేగా మహమ్మద్ రఫీ. విజయవాడ ఎమ్మెల్యేగా డాక్టర్ యూ గన్యవతి. గుంటూరుఎమ్మెల్యేగా దేవి. కళ్యాణ్ దుర్గం ఎమ్మెల్యే గా నందిని. నరసరావు పేట గాఎమ్మెల్యే నందికొట్కూరుగా కమల్. హిందూపురం ఎమ్మెల్యేగా మల్లికార్జున. ఆళ్లగడ్డ ఎమ్మెల్యేగా చంద్రశేఖర్. డోన్ ఎమ్మెల్యేగా ప్రసాద్. మిగతా పేర్లు త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ జేఏసీ జిల్లా అధ్యక్షులు పద్మావతి బీసీ సంక్షేమ సంఘం నాయకురాలు శ్రిరిష యాదవ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సింధు నాగేశ్వర రావు యాదవ్ కురువ సంఘం జిల్లా నాయకులు వెంకటేష్ మైనారిటీ సంఘం జిల్లా నాయకులు షఫీ ఎస్సీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు లాయర్ మద్దూరిరవీంద్రకుమార్ అర్య కటిక సంఘం జిల్లా నాయకులు రామోజీరావు వడ్డెర సంఘం జిల్లా నాయకులు రాజు పూసల సంఘం జిల్లా నాయకులు క్రిష్ణ వాల్మీకి సంఘం జిల్లా నాయకులు నాగరాజు నాయుడు తదితరులు పాల్గొన్నారు .

# అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా జడ్జి గారికి సన్మానం





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 06: నంద్యాల జూనియర్ సివిల్ జడ్జ్ జి అర్చన గారిని సన్మానించిన మహిళా సమాఖ్య నాయకులు అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8 పురస్కరించుకొని బుధవారం నంద్యాల జూనియర్ సివిల్ జడ్జి గారిని సన్మానించడం జరిగింది. స్థానిక రెవిన్యూ నిశాంత్ భవన్ లో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మావతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు . ఈ సందర్భంగా సివిల్ జడ్జి అర్చన గారిని దృశ్యాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా జి అర్చన గారు మాట్లాడుతూ దేశంలో మహిళల పైన లైంగిక వేధింపులు రోజురోజుకు పెరిగిపోతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. స్త్రీల పట్ల వివక్షత పెరుగుతున్నదని మహిళాల హక్కుల కు రక్షణ కరువైందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నేటి స్త్రీ సమాజంలో అన్ని విధాలుగా అణిచివేతలకు గురవుతున్నదని తెలిపారు. అత్త మామ వల్ల వేధింపులు భర్త వేధింపులు పెరిగిపోతున్నాయని గృహహింస రోజు రోజుకి పెరిగిపోతుందని ఆమె తెలిపారు. ఈ నేపథ్యంలోనే న్యాయస్థానాలు మహిళలకు జరుగుతున్న అన్యాయాలు అక్రమాలను లైంగిక వేధింపులను గృహింసను నిరోధించడానికి న్యాయస్థానాలు మహిళల రక్షణ కొరకై 498ఎ గృహహింస నిరోధక చట్టాన్ని తెచ్చిందని ఆమె గుర్తు చేశారు. మహిళలు తమకు జరిగే అన్యాయాన్ని నిర్భయంగా ఎదుర్కోవాలని తమ రక్షణ కొరకు న్యాయస్థానాలను ఆశ్రయించాలని అన్నారు . ఈ సన్మాన కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు లక్ష్మీదేవి, రజిత, ప్రమీల మరియు చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు, సిపిఐ జిల్లా కార్యదర్శి రంగ నాయుడు, సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న.గోస్పాడు మండల కార్యదర్శి హరినాథ్. తదితరులు పాల్గొన్నారు మహిళలు తమ హక్కుల రక్షణ కొరకు ఐక్యంగా ఉద్యమించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లానాయకురాలు.డోన్ లక్ష్మీదేవి.షమీం బేగం.ప్రమీల. గోస్పాడు లక్ష్మీదేవి సుశీలమ్మ నారాయణమ్మ.మున్ని.స్వాతి.. మూర్తి జాబి.తదితరులు పాల్గొన్నారు.

## మల్లెలల్ఫ్రెడ్ రాజును ను కలిసిన బుట్టా రేణుక



బుట్టా రేణుక తో మల్లెల్ఫ్రెడ్ రాజు దంపతులు

ఎమ్మిగనూరు : మార్చి 6మల్లెల గ్రూప్స్ అధినేత, వైసీపీ నాయకులు మల్లెల అల్ ఫ్రెడ్ రాజును ఎమ్మిగనూరు వైసీపీ ఇంచార్జి బుట్టా రేణుక ఆయన ఇంటికి వెళ్లి మర్యాద పూర్వకంగా బుధవారం కలిశారు. ఈ మేరకు మల్లెల బుట్టా రేణుకకు సన్మానించి, పట్టు చీరను అందజేశారు. ఈ సందర్భంగా బుట్టా రేణుక మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో నా గెలుపు సహకారం అందించాలని కోరారు. పార్టీ గెలుపుకు అందరూ కలసిగట్టుగా పని చేయాలని పేర్కొన్నారు.అనంతరం మల్లెలఫ్రెడ్ రాజు మాట్లాడుతూ త్వరలోనే పాస్టర్లతో పాటు ఇతర సంఘాల నాయకులు, వికలాంగుల, మహిళల సంఘాలతో పాటు ఇతర సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేస్తామని, మీ గెలుపుకు అన్ని విధాలుగా సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పార్టీ పట్టణ అధ్యక్షుడు బుట్టా రంగయ్య, కౌన్సిలర్ నీలకంఠ, శివ ప్రసాద్, రఘు, సామెల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## టైలర్ల సంక్షేమ, అభివృద్ధికి తనవంతు సహకారం... ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 06-వైఎస్ఆర్సిపి ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత చేపట్టిన అనేక సంక్షేమ పథకాల్లో భాగంగా అర్హులైన టైలర్లకు నేరుగా వారి ఖాతాల్లో ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు. అదేవిధంగా నంద్యాలలోని టైలర్ ల యొక్క సంక్షేమ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవి రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం నంద్యాల పట్టణం మున్సిపల్ హై స్కూల్ సమీపంలోని గుర్రాల పేటలో ది నంద్యాల జిల్లా మగ్గం వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా టైలర్లతో సమావేశం నిర్వహించారు . ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శిల్పారవి రెడ్డి, స్థానిక కౌన్సిలర్ తమిమ్, కోఆప్షన్ సభ్యులు సలాముల్లా, మహమ్మద్ రఫీ, టైలర్స్ అసోసియేషన్ నాయకులు హాజరయ్యారు.రాష్ట్ర ప్రభుత్వం చేతివృత్తుల వారికి ఆర్థిక సహాయం అందించి వ్యాపారంలో మరింత అభివృద్ధి సాధించేందుకు వివిధ సంక్షేమ పథకాలను అందించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా టైలర్స్ యొక్క సంక్షేమ అభివృద్ధికి ఆర్థికంగా చేయూత అందిచడం జరిగిందని తెలిపారు. .

## పసరపాడు గ్రామానికి చెందిన ఇద్దరు దివ్యాంగులకు ట్రై సైకిల్స్ పంపిణీ :ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి'

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 06-నంద్యాల నియోజకవర్గం గోస్పాడు మండలం పసరపాడు గ్రామానికి చెందిన ఇద్దరు దివ్యాంగులకు ఎమ్మెల్యే శిల్ప రవి రెడ్డి తన సొంత నిధులతో ట్రై సైకిళ్లను అందజేశారు. గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ ఎంపీటీసీ భక్తవత్సల రెడ్డి మరియు వైసీపీ నాయకులు ప్రసాద్ యాదవ్ సహకారంతో డివ్యాంగులు ఎమ్మెల్యేను ట్రై సైకిల్స్ అవసరమైనదని కోరారు . స్పందించిన ఎమ్మెల్యే కొద్ది రోజుల్లోనే దివ్యాంగులకు ట్రై సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు లబ్ధిదారులు ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77410